


వాహన చోదకుల, విద్యార్థుల ఇబ్బందులు



జీఎంసీ కార్యాలయంలోకి చేరిన వర్షం నీరు



వర్షం నీటితో నిండిన కంకరగుంట అండర్ బ్రిడ్జి - సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు

దంచికొట్టిన వాన

- మూడు గంటలు ఏకధాటిగా కురిసిన వర్షం
- జలమయంగా మారిన రహదారులు
- తీవ్ర ఇబ్బందులు పడ్డ వాహనచోదకులు

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో గురువారం భారీ వర్షం కురిసింది. సాయంత్రం 6 గంటల నుంచి ప్రారంభమైన వర్షం 9 వరకు ఆగకుండా కురిసింది. దీంతో నగరంలోని పలు వీధులు జలమయంగా మారాయి. ముఖ్యంగా డొంకరోడ్డు, పట్నంబజారు, రాజీవ్‌గాంధీ నగర్, సంజీవయ్య నగర్, పాత గుంటూరు, కొరిటెపాడు, నెహ్రూ నగర్, అరండల్ పేట తదితర ప్రాంతాలు జలమయంగా మారాయి. సాయంత్రం సమయంలో వర్షం కురియడంతో స్కూల్ నుంచి ఇంటికి వెళ్లే విద్యార్థులు, విధులు ముగించుకొని ఇళ్లకు వెళ్లే ఉద్యోగులు, చిరు వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. గత కొద్ది రోజులుగా ఎండ వేడిమితో అల్లాడిపోయిన నగరవాసులకు గురువారం కురిసిన వర్షంతో కాస్తంత ఉపశమనం చేకూరినట్లయింది.

లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలవకుండా చర్యలు

గుంటూరు నగరంలో గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలవకుండా ఇంజనీరింగ్, ప్రజారోగ్య అధికారులు సమన్వయంతో పనులు చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. తాగునీటి సరఫరాకు అంతరాయం కలగకుండా హెడ్ వాటర్ వర్క్స్, నెహ్రూనగర్, నాజ్ సెంటర్ రిజర్వాయర్ల వద్ద విద్యుత్ అంతరాయం కలిగిన నీటి సరఫరాకి ఇబ్బందులు లేకుండా ఇంజనీరింగ్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. డ్రైయిన్‌లలో వ్యర్థాలు నిలవకుండా, కల్వర్టుల వద్ద వర్షపు నీరు నిలవకుండా శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు.

క్లుప్తంగా

జీఎస్టీ కార్యాలయంలో కంటి వైద్య పరీక్షలు



లక్ష్మీపురం: కళ్ల సమస్యలను అశ్రద్ధ చేయవద్దని సెంట్రల్ జీ.ఎస్.టి కమిషనర్ సాధు నరసింహారెడ్డి అన్నారు. స్థానిక కన్నవారితోటలోని సెంట్రల్ జీఎస్టీ గుంటూరు కమిషనరేట్ కార్యాలయంలో గురువారం కమిషనర్ సాధు నరసింహారెడ్డి కంటి ఆరోగ్య వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కంటి వైద్య పరీక్షలకు ముందుకు వచ్చిన వాసన్ ఐ కేర్ వైద్య బృందానికి, నిర్వాహకులకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. శిబిరంలో అడిషనల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి, జాయింట్ కమిషనర్ లక్ష్మీ నారాయణ, ఏసీ నాగరాజు హాజరయ్యారు.

మైనారిటీ వసతి గృహంలో చేరికలకు దరఖాస్తుల స్వీకరణ

లక్ష్మీపురం: రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ ఉత్తర్వుల మేరకు స్థానిక పట్టాభిపురంలోని శ్యామల నగర్ రైల్వే గేటు వద్దనున్న ప్రీ మెట్రిక్ బాలికల వసతి గృహంలో చేరికలకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి షరీఫ్ గురువారం తెలిపారు. 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆసక్తి గలవారు పూర్తిచేసిన దరఖాస్తులను జిల్లా సంక్షేమ శాఖ అధికారి కార్యాలయం జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో సమర్పించాల్సిందిగా తెలిపారు. క్రైస్తవ మాదిగ, క్రైస్తవ మాల, ఆర్సీఎం, ఇతర క్రైస్తవ విద్యార్థులు తహసీల్దార్ నుంచి తీసుకున్న కుల ధ్రువీకరణ పత్రం జతపర్చాలన్నారు. దరఖాస్తుకు 5 పాస్‌పోర్టు సైజు ఫొటోలు, రేషన్, ఆధార్ కార్డుల నకలు జతచేయాలన్నారు.

యానాదుల సమస్యలు పరిష్కరించాలి

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో యానాదులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని బహుజన మహాసభ కేంద్ర కమిటీ కార్యదర్శి జి.ఆర్.భగత్ సింగ్ విన్నవించారు. ఈ మేరకు గురువారం నగర కమిషనర్ పులి శ్రీనివాసులును ఆయన చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యానాదులు ఉండటానికి ఇళ్ల స్థలాలు లేవని, నీళ్లు, కరెంటు సమస్యలు వీరిని వెంటాడుతున్నాయని, వారి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. కమిషనర్‌ను కలిసిన వారిలో జూపూడి శ్రీనివాసరావు, పలుకూరి ప్రసాదరావు, షేక్ సల్మా, షేక్ సైదా, మణికల నరసయ్య, చెంచమ్మ తదితరులు ఉన్నారు.

పెండింగ్ జీతాల విడుదలపై కమిషనర్‌కు ధన్యవాదాలు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ కార్మికులకు ఈనెలలో అందాల్సిన జీతాలు ఆలస్యం కావడంతో నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆర్థిక శాఖ అధికారులతో మాట్లాడి జీతాలు ఇప్పించడంపై ది ఆంధ్రప్రదేశ్ మున్సిపల్, ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్, శానిటరీ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈదుల మూడి మధుబాబు నగర కమిషనర్‌కు ధన్యవాదాలు తెలిపారు. గురువారం రాత్రి కమిషనర్ చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈసందర్భంగా మధుబాబు మాట్లాడుతూ అండర్ డ్రైయినేజీ వర్కర్లకు, లీక్ వర్కర్స్‌కు పనిముట్లు ఇవ్వాలని, సెక్యూరిటీ గార్డులకు యూనిఫామ్ ఇప్పించాలని కోరారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

పట్నంబజారు: కుటుంబ కలహాల నేపథ్యంలో మనస్తాపానికి గురైన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై కేసు నమోదైంది. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బ్రాడీపేట 2వలైనులో నివాసం ఉండే ఏడిద విజయ్ (23) అరండల్‌పేటలోని ఓ వస్త్ర దుకాణంలో పనిచేస్తుంటాడు. భార్య దేవితో గత కొంతకాలంగా వివాదం జరుగుతున్న నేపథ్యంలో ఆమె పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపానికి గురైన విజయ్ బ్రాడీపేటలోని తన నివాసంలో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి పాఠ్యాంశాల బోధనపై పరిశీలన

ప్రత్తిపాడు: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాలను ఉన్నతాధికారులు శుక్రవారం నుంచి పరిశీలించనున్నారు. దీనికోసం మండలంలో కొంత మంది ఉపాధ్యాయులను ఎంపిక చేసి ఇటీవలే టీచింగ్ టూల్ యాప్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ నేపథ్యంలో శిక్షణ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులకు గురువారం స్థానిక మండల విద్యా వనరుల కార్యాలయంలో ఎంఈవోలు సీహెచ్ రమాదేవి, జి. లీలారాణి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ శిక్షణ పొందిన ఉపాధ్యాయులు, సీఆర్పీలు వారంలో రెండు రోజులు వారికి కేటాయించిన పాఠశాలల్లో ఉపాధ్యాయులు పాఠ్యాంశాలు చెబుతున్న తీరును పరిశీలించి, వివరాలను టీచింగ్ టూల్ యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఇస్కాన్ ఆధ్వర్యంలో చిత్రలేఖన పోటీలు



చిత్ర లేఖన పోటీలను పర్యవేక్షిస్తున్న ప్రభూజీ, చక్రనాగ్, కోటేశ్వరరావు

గుంటూరు ఎడ్యుకేషన్: నగరంపాలెంలోని ప్రజ్ఞ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు ఇస్కాన్ ఆధ్వర్యంలో గురువారం చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇస్కాన్ నైతిక విద్య ప్రచార బాధ్యుడు హరేకృష్ణ ప్రభూజీ మాట్లాడుతూ విద్యార్థులలో సృజనాత్మకతతో పాటు భక్తి భావాలు పెంపొందించేందుకు చిత్రలేఖనం, రాధాకృష్ణుల వస్త్రధారణ పోటీలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పాఠశాల కరస్పాండెంట్ నాయుడు చక్రనాగ్ మాట్లాడుతూ నాణ్యమైన విద్యా బోధనతో పాటు విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కావలసిన అన్ని కార్యక్రమాలను పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు వివరించారు. చిత్రలేఖన పోటీలకు ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇస్కాన్ ప్రతినిధి కమలకాంత దాస్, ప్రిన్సిపాల్ ఎస్.కోటేశ్వరరావు ఉపాధ్యాయులు దాసరి లక్ష్మి, పోకూరి లత, షేక్ సుభాని పాల్గొన్నారు.

అనధికార ప్రకటనల హోర్డింగ్స్ తొలగింపు

జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు



అనధికార ప్రకటనల హోర్డింగ్స్‌ను తొలగిస్తున్న పట్టణ ప్రణాళిక సిబ్బంది

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ అనుమతితో నగరంలో ఏర్పాటు చేసిన ప్రతి ప్రకటన బోర్డ్‌కు నిర్దేశిత మీడియా డివైజ్ డిస్ ప్లే ఫీజులు చెల్లించి ఉండాలని, ఫీజులు చెల్లించని, అనుమతి లేని బోర్డులను తొలగిస్తామని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. కమిషనర్ ఆదేశాల మేరకు గురువారం పట్టణ ప్రణాళిక అధికారులు నగరంలోని పలు ప్రాంతాల్లో ఫీజులు చెల్లించని, అనధికార హోర్డింగ్‌లు, బోర్డ్‌లను, ఫ్లెక్సీలను తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో నగరపాలక సంస్థ నుంచి అనుమతి పొందిన ప్రకటనల హోర్డింగ్స్ యజమానులు మీడియా డివైజ్ డిస్ ప్లే ఫీజులు సక్రమంగా చెల్లించాలని, లేకుంటే సదరు బోర్డ్ లను తొలగించి, ఫీజుల వసూళ్లకు చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. బుధవారం నుంచి నగరంలో పట్టణ ప్రణాళిక అధికారులు నగరంలో సుమారు 120కి పైగా అనధికార హోర్డింగ్‌లను తొలగించారన్నారు. అనధికార బోర్డు, హోర్డింగ్స్ నగరంలో ఉండడానికి వీలు లేదని, అటువంటి వాటిని వెంటనే తొలగించడానికి పట్టణ ప్రణాళిక అధికారులు స్పెషల్ టీంను అందుబాటులో ఉంచాలని సిటీ ప్లానర్‌ని ఆదేశించారు.

పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా రోడ్ల విస్తరణ చేస్తున్నామని, కొందరు రోడ్ల మీద వ్యాపారాలు చేస్తూ ట్రాఫిక్ కి అంతరాయం కల్గిస్తున్నారన్నారు. రోడ్, ఫుట్ పాత్ ఆక్రమణల తొలగింపులో రాజీపడకూడదన్నారు. పట్టణ ప్రణాళిక అధికారుల ద్వారా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని, తమ క్షేత్ర స్థాయి పర్యటనలో ఎక్కడైనా అనధికార బోర్డులు గుర్తిస్తే సంబంధిత కార్యదర్శిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

వేదసీడ్స్‌లో చిరంజీవి పుట్టినరోజు వేడుకలు



కేక్ కట్ చేస్తున్న తులసి ధర్మచరణ్, డాక్టర్ చంద్రశేఖర్

కొరిటెపాడు: సినిమా రంగంలో, నిజ జీవితంలో మెగాస్టార్ చిరంజీవి అలుపెరగని సూర్యుడు అని వేద సీడ్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి.చంద్రశేఖర్ అన్నారు. స్థానిక అరండల్ పేట 11/3 లోని వేద సీడ్స్ ప్రధాన కార్యాలయంలో సినీ హీరో, పద్మవిభూషణ్ డాక్టర్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలను ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్‌తో కలసి ఘనంగా నిర్వహించారు. తొలుత కేక్ కట్ చేసి చిరంజీవికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఏ రంగంలో నైనా సరే నెంబర్‌వన్ స్థానం దక్కించుకోవడం అంత సులువు కాదని, ఇందుకు కఠోర శ్రమ, గొప్ప క్రమశిక్షణ, ఉన్నతమైన వ్యక్తిత్వం, సేవా గుణం, ఇవన్నీ మెగాస్టార్ చిరంజీవిలో వంద శాతం ఉన్నాయన్నారు. ఈడీ తులసి ధర్మచరణ్ మాట్లాడుతూ చిరంజీవి అనే నాలుగు అక్షరాలు యావత్ ప్రపంచానికి పరిచయం అక్కరలేని పదాలని, ఆయన ఓ కళాకారుడని, సినిమా మీద ఆయనకున్న ప్రేమ మాటల్లో చెప్పలేనిదని, వయసుతో పాటు ఆయన మీద అభిమానం అభిమానులకు పెరిగిందే గానీ తగ్గలేదన్నారు. చిరంజీవి ఫ్యాన్స్ క్రమశిక్షణ, బాధ్యతతో ఉంటూ ఆయన బాటలో నడుస్తూ రక్తదానం, నేత్ర దానంతోపాటు ఇతర సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తూ మంచి పేరును తీసుకువస్తున్నారని తెలిపారు. 2025 సంకాంత్రికి విడుదల కాబోతున్న ఆయన చిత్రం విశ్వంభర అఖండ విజయం సాధించి నూతన రికార్డులను సాధించాలని ఆకాంక్షించారు. తోట రంగారావు, గుడి సతీష్ కుమార్, తాయి శ్రీనివాసరావు, తేలప్రోలు వెంకట్రావు, ఆళ్ల భాస్కర్, గాజుల సాయిరాం, పసుపులేటి రమేష్, వేద సీడ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎన్‌యూలో...

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఉద్యోగులు, విద్యార్థులు కలిసి పద్మ విభూషణ్ మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. విశ్వవిద్యాలయ ముఖద్వారం వద్ద భారీ కేక్ కట్ చేసి మెగాస్టార్ వంద సంవత్సరాలు వర్ధిల్లాలని నినాదాలు చేశారు. బాణాసంచా కాల్చారు. కార్యక్రమంలో చిరంజీవి అభిమానులు విశ్వవిద్యాలయ జనసేన నాయకులు తోట వెంకటేష్, పుత్తూరు నాగరాజు, తోకల రామకృష్ణ, సతీష్ కుమార్, నారాయణ స్వామి, ఎం.రమాదేవి, జల్లెపల్లి రామకృష్ణ, ఆర్ ఆనంద్, సుశీల, రౌతు వీర రాజు, విద్యార్థి జనసేన నాయకులు బి.జగదీష్, నితీష్ యాదవ్, పవన్ సాయి, రామాంజనేయులు, జనసేన, టీఎస్ఎఫ్ స్టూడెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

ఇండియన్ బ్యాంక్‌లో కస్టమర్ డే



కస్టమర్ డే కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ పూర్ణచంద్రరావు, సిబ్బంది, ఖాతాదారులు

కొరిటెపాడు: ఇండియన్ బ్యాంక్ భారతదేశంలో ప్రముఖ పబ్లిక్ సెక్టార్ బ్యాంక్ అని బ్రాంచ్ మేనేజర్ జి.పూర్ణచంద్రరావు అన్నారు. గుంటూరు నగరంలోని సాంబశివపేటలోని ఇండియన్ బ్యాంక్‌లో గురువారం కస్టమర్ డే నిర్వహించారు. ఈసందర్భంగా పూర్ణచంద్రరావు మాట్లాడుతూ ఇండియన్ బ్యాంక్ 1907 ఆగస్టు 15న వ్యాపారాన్ని ప్రారంభించిందన్నారు. నేటి వరకు గోల్డెన్ జూబ్లీ, డైమండ్ జూబ్లీ, ప్లాటినం జూబ్లీలను జరుపుకొందన్నారు. బ్యాంకు 118వ ఫౌండేషన్‌ను ఆగస్టు 15న జరుపుకొందన్నారు. ప్రతి సంవత్సరం బ్యాంక్ వ్యవస్థాపక దినోత్సవంతో పాటు ఆగస్టు నెలలో కస్టమర్ మీట్/ కస్టమర్ డేని నిర్వహించడం జరుగుతోందన్నారు. బ్యాంక్ రూ. 12.20 లక్షల కోట్ల వ్యాపారానికి చేరుకుందని వెల్లడించారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో 5846 శాఖలు ఉన్నట్లు తెలిపారు. బ్యాంక్ అన్ని రకాల సేవలను కలిగి ఉందన్నారు. కస్టమర్లతో నిరంతరం అందుబాటులో ఉండేందుకు దేశంలోని 100 ప్రధాన కేంద్రాలలో వనరుల సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బ్యాంక్ ఇండ్ సూపర్ 400 రోజులను ప్రారంభించిందని, దీనిద్వారా ఖాతాదారులకు 8 శాతం వరకు వడ్డీ వస్తుందన్నారు. కస్టమర్ల కోసం (044-28882999) ప్రత్యేక హెల్ప్ లైన్ నంబరును ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్ (ఇండా స్మార్ట్), సౌండ్ బాక్స్ కూడిన క్యూ ఆర్ కోడ్లు, డెబిట్/క్రెడిట్ కార్డ్, తదితర డిజిటల్ సేవలను అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, కస్టమర్లు, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు ఆర్థిక భరోసా లభించాలి

లక్ష్మీపురం: దేశంలో 71 శాతం మంది వృద్ధులకు కుటుంబ సభ్యుల నుంచి ఆర్థిక భరోసా లభించటం లేదని హెల్పేజ్ ఇండియా సంస్థ ఇటీవల విడుదల చేసిన నివేదిక స్పష్టం చేస్తోందని సీనియర్ సిటిజన్స్ జిల్లా ఫోరం కన్వీనర్ కె.సాంబయ్య అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గురువారం సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2036 నాటికి దేశవ్యాప్తంగా బాల బాలికల సంఖ్య తగ్గిపోయి అరవై ఏళ్ల పైబడిన వారు అధికమవుతారని కేంద్ర ప్రభుత్వ తాజా నివేదిక వెల్లడిస్తుందన్నారు. విశ్రాంత హెచ్ఎం ఆర్.వి.సింగరయ్య, సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డిలు మాట్లాడారు. అదేవిధంగా సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ జానపద దినోత్సవం సందర్భంగా నిర్వహించారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

నెహ్రూనగర్: కోల్‌కతాలో ట్రైనీ వైద్యురాలి హత్యాచారం కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని స్వర్ణాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఏసుబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరంలోని సంఘ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘటన జరిగి రెండు వారాలు కావస్తున్నప్పటికీ ఇంకా నిందితులను పూర్తిస్థాయిలో అదుపులోనికి తీసుకోలేని పరిస్థితి నెలకొందన్నారు. విచారణ వేగవంతం చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి చర్యలు జరగకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు అమలు చేయాలన్నారు. నిందితులకు కఠిన శిక్షలు అమలు చేసి, ఆమె కుటుంబ సభ్యులకు అండగా నిలవాలని కోరారు.

కాటూరి వెంకటేశ్వరరావుకు విశిష్ట విద్యా సేవా పురస్కారం



గుంటూరు ఎడ్యుకేషన్: సదరన్ ప్రైవేటు అధ్యాపక, ఉపాధ్యాయ సంస్థ (ఎస్పీఎల్‌టీఏ) ఆధ్వర్యంలో జాతీయ విశిష్ట విద్యా సేవా పురస్కారాన్ని కాటూరి పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ కాటూరి వెంకటేశ్వరరావుకు ప్రదానం చేయనున్నట్లు సంస్థ గౌరవాధ్యక్షుడు, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, అధ్యక్షుడు డాక్టర్ పి.నాగయ్య గురువారం ఓప్రకటనలో తెలిపారు. గుంటూరు రూరల్ లాలుపురం గ్రామంలో గత 35 ఏళ్లుగా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందిస్తూ, చేస్తున్న సేవలకు గుర్తింపుగా కాటూరి వెంకటేశ్వరరావును పురస్కారానికి ఎంపిక చేసినట్లు వివరించారు. ఆదివారం ఉదయం 10 గంటలకు ఏసీ కళాశాలలో జరిగే కార్యక్రమంలో ఆయనకు పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

వ్యక్తిని మోసం చేసి భూమిని విక్రయించిన వారిపై కేసు

పట్నంబజారు: వ్యక్తిని మోసం చేసి భూమి విక్రయించిన పలువురిపై కేసు నమోదైంది. పట్టాభిపురం ఎస్ఐ మధుపవన్ తెలిపిన వివరాల ప్రకారం గుజ్జనగుండ్లలో నివాసం ఉండే పెంట్యాల భూషయ్య తన రెండు ఎకరాల భూమిని దేవరశెట్టి కిరణ్, మల్లికార్జునరావు, శ్రీనివాసరావు, కృష్ణారావులకు ఉమ్మడి రిజిస్ట్రేషన్ చేసి రూ.1,22,80,000 అప్పుగా తీసుకున్నారు. అయితే పెంట్యాల భూషయ్యకు తెలియకుండా నలుగురు వ్యక్తులు కలిసి రెండు ఎకరాల భూమిని రూ. 5.80 కోట్లకు విక్రయించారు. మోసపోయానని గ్రహించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జూడాల సమ్మెకు సంఘీభావం

మద్దతు తెలిపిన న్యాయవాదులు, ఎల్ఐసీ ఉద్యోగులు

గుంటూరు మెడికల్: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారాన్ని ఖండిస్తూ గుంటూరు జీజీహెచ్‌లో ఆంధ్రప్రదేశ్ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేస్తున్న సమ్మె గురువారానికి పదో రోజుకు చేరుకుంది. జూడాలు విధులు బహిష్కరించి సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. నల్లబ్యాడ్జీలు ధరించి ప్లకార్డులు చేతపట్టుకుని నినాదాలు చేస్తూ నిరసన తెలియజేశారు. తాము సమ్మె చేయడానికి గల కారణాల్ని రోగులకు అర్థమయ్యేలా పలు వార్డుల్లో తిరిగి వివరించారు. సాధారణ ప్రజలు తమ సమ్మెను అర్థం చేసుకోవడానికి లఘు నాటికను సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట ప్రదర్శించారు. విధి నిర్వహణలో వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి వివరించారు. జూడా సమ్మెకు న్యాయవాదులు తమ మద్దతు తెలిపారు. గుంటూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలువురు న్యాయవాదులు విధులు బహిష్కరించారు. జిల్లా కోర్టు ప్రాంగణం నుంచి గుంటూరు జీజీహెచ్ వరకు ర్యాలీగా వచ్చి మద్దతు ప్రకటించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ జూడాల వద్దకు చేరుకుని వారి సమస్యలను ఆలకించారు. తక్షణమే వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు వైద్యుల రక్షణకు హైపవర్ కమిటీ ఆసుపత్రిలో నియమిస్తున్నామని, జూడాలు తమ సమస్యల్ని కమిటీకి నివేదించాలని సూచించారు. కార్యక్రమంలో జూడాల సంఘం నేతలు డాక్టర్ పి.దీక్షిత్, డాక్టర్ అన్వర్‌బాషా, డాక్టర్ రవి, డాక్టర్ నిమ్మి, డాక్టర్ చరణ్, డాక్టర్ మనోజ, డాక్టర్ అశ్విని, డాక్టర్ సరిత, హౌస్ సర్జన్లు బాబి, దీపిక, ఎంబీబీఎస్ వైద్య విద్యార్థులు మోహన్‌చంద్ర, చరణ్, పాల్గొన్నారు.

విద్యార్థినుల సమస్యలకు సత్వర పరిష్కారం
వీసీ ప్రొఫెసర్ గంగాధరరావు

ఏఎన్‌యూ : కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై దారుణ ఘటనకు నిరసనగా గురువారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో పీజీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ లీగల్ స్టడీస్ అండ్ రీసెర్చ్, అంబేడ్కర్ స్కూల్ ఆఫ్ లీగల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. విద్యార్థినుల భద్రతపై వర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య కె. గంగాధరరావుకు వినతి పత్రాన్ని సమర్పించారు. విశ్వవిద్యాలయంలో విద్యార్థినుల రక్షణ కోసం ప్రత్యేక అధికారిని నియమించి ఎప్పటికప్పుడు వారి సమస్యలు పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై వీసీ సానుకూలంగా స్పందించారు. చర్యలు తీసుకోవాల్సిందిగా విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ ఎల్. జయశ్రీ ని సూచించారు. విశ్వవిద్యాలయంలోని అంబేడ్కర్ సెంట్రల్ లైబ్రరీ వద్ద ప్రారంభమైన ర్యాలీ అన్ని విభాగాలు మీదుగా వర్సిటీ ప్రధాన గేటు లోని ఆచార్య నాగార్జున విగ్రహం వరకు సాగింది. అక్కడ విద్యార్థులు కొంతసేపు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎల్ఎల్ఎం థ్రైం బ్రాంచ్ విద్యార్థిని తన్మయి విద్యార్థినుల సమస్యల పరిష్కారం కోసం సింగిల్ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ (ఎస్‌పీఓసీ)తో పాటు ఉమన్ గ్రీవెన్స్ సెల్‌ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ ఎల్. జయశ్రీ , ఎస్. సతీష్, పి. వెంకటరమణ, జి.వై.ఎస్. కిశోర్ కుమార్, ఎస్. చంద్రశేఖర్, ఎస్. రాధిక, సీహెచ్. సురేష్, శివరాం, చిన్నారావు, సతీష్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ

నగరంపాలెం: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారంలో నిందితుల్ని కఠినంగా శిక్షించాలని కోరుతూ గుంటూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ప్రదర్శన చేపట్టారు. నగరంపాలెం జిల్లా కోర్టు ఆవరణ నుంచి ప్లకార్డులతో ప్రదర్శనగా బయలుదేరారు. మెడికల్ కళాశాల, శంకర్‌విలాస్ రైల్వే ఓవర్ బ్రిడ్జి మీదుగా జీజీహెచ్‌కు చేరుకున్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాసు వెంకటరెడ్డి మాట్లాడుతూ కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై అత్యాచారం, హత్య ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. మహిళల భద్రతకు కేంద్ర ప్రభుత్వం నూతన చట్టం తేవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు గౌరీశంకర్, ప్రధాన కార్యదర్శి అనూరాధ, న్యాయవాదులు పద్మవల్లి, ఝాన్సీ, నారదాసు వీరమణీంద్ర, పులి ప్రత్యూష పాల్గొన్నారు.

అభ్యుదయ మహిళా కళాశాలలో కామర్స్ ఫెస్ట్-2024



ఎన్ఆర్ఐ ఇక్కుర్తి వెంకట్‌ను సత్కరిస్తున్న రోహిణిదేవి, అధ్యాపకులు

గుంటూరు ఎడ్యుకేషన్: జీవితంలో ఉన్నతస్థానానికి చేరుకునేందుకు లక్ష్యాన్ని నిర్దేశించుకోవడం ఎంతో అవసరమని అమెరికాకు చెందిన డేటా ఎనలిస్ట్ ఇక్కుర్తి వెంకట్ పేర్కొన్నారు. లక్ష్మీపురంలోని అభ్యుదయ మహిళా కళాశాలలో గురువారం కామర్స్ ఫెస్ట్-2024 నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకట్ మాట్లాడుతూ జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోవడంతో పాటు జీవితాన్ని సక్రమంగా గడిపేందుకు కీలకమైన ఏడు సూత్రాలను గురించి వివరించారు. భారతీ సోఫ్‌వర్క్స్ ఎండీ దివ్యభారతి మాట్లాడుతూ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా రాణించేందుకు, కంపెనీ నిర్వహణకు సంబంధించిన మార్గాలను వివరించారు. నందమూరి దీప్తి మాట్లాడుతూ స్థిరమైన లక్ష్యం ఏర్పరచుకుని స్పష్టమైన అవగాహనతో ముందుకు వెళ్లాలని సూచించారు. అనంతరం విద్యార్థినులకు క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల బీఎస్ఆర్కే ప్రసాద్, ప్రిన్సిపాల్ బి. రోహిణిదేవి, కామర్స్ ఫెస్ట్ సమన్వయకర్త ఆర్. అర్జున్, శివప్రసాద్ పాల్గొన్నారు.

జీఎస్టీ రాష్ట్ర కార్యాలయాన్ని గుంటూరుకు మార్చండి

సెంట్రల్ జీఎస్టీ ఆడిట్ కమిషనర్‌ను కలిసిన పెన్షనర్ల సంఘ నాయకులు

లక్ష్మీపురం: కేంద్రప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం విశాఖపట్నంలో ఉన్న సీజీఎస్టీ ఆడిట్ కమిషనరేట్ రాష్ట్ర ప్రధాన కార్యాలయాన్ని గుంటూరుకు తరలించాలని ఇండైరెక్ట్ టాక్సెస్ అండ్ కస్టమ్స్ శాఖకు చెందిన రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు టి.వివేకానంద, గద్దె తిలక్ పేర్కొన్నారు. ఈమేరకు గుంటూరు కాకాని రోడ్‌లోని సెంట్రల్ జీఎస్టీ ఆడిట్ కార్యాలయంలో గురువారం రాష్ట్ర ఆడిట్ కమిషనర్ పి.ఆనంద్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ విశాఖపట్నం కేంద్రంగా వున్న సెంట్రల్ జీఎస్టీ చీఫ్ కమిషనర్ కార్యాలయం అమరావతికి, విశాఖ ఆడిట్ కమిషనరేట్ కార్యాలయం గుంటూరుకు తరలిపోవాలని పది సంవత్సరాల క్రితమే సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇండైరెక్ట్ టాక్సెస్ అండ్ కస్టమ్స్ నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. కానీ అప్పటి నుంచి ఇప్పటి వరకు కూడా ఎలాంటి మార్పు జరగలేదన్నారు. ఈ విషయంలో చొరవ తీసుకొని ఆడిట్ హెడ్ క్వార్టర్స్‌ను గుంటూరుకు తరలించాలని కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. ఆడిట్ కమిషనర్‌ను కలిసిన వారిలో పెన్షనర్ల సంఘ నాయకులు పి.వి.సత్యనారాయణ, గుమ్మడి సీతారామయ్య చౌదరి, పి.కోటేశ్వరరావు, సామ్రాజ్యం ఉన్నారు.

ధ్యేయ'మొక్క'టే పర్యావరణ పరిరక్షణ



కాకుమాను జెడ్పీ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ప్రత్తిపాడు/కాకుమాను: పర్యావరణ పరిరక్షణే ప్లాంట్ ఫర్ మదర్ ధ్యేయమని సర్పంచ్ శిఖా విజయలక్ష్మి చెప్పారు. వంగిపురంలో గురువారం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ఆధ్వర్యంలో 'ప్లాంట్ ఫర్ మదర్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇన్‌చార్జి ఏపీఓ మస్తాన్‌వలి నేతృత్వంలో గ్రామ సర్పంచ్ శిఖా విజయలక్ష్మి స్థానిక రక్షిత మంచి నీటి చెరువు గట్టుపై మొక్కలు నాటారు. కాకుమాను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ ముఖ్యఅతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను వివరించారు.